RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం । 2 । జూలై । 2026

## మొలకెత్తని తేజస్విని రకం సోయాబీన్ విత్తనాలు.. ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు






**బోథ్, జూలై 1 (తెలంగాణ వాణి ప్రతినిధి):** బోథ్ మండలం మర్లపెల్లి గ్రామానికి చెందిన రైతు తలంపుల రమేష్, నక్కలవాడ శివరాం పొలంలో కోరమండల్ ఫర్టిలైజర్స్ ద్వారా కొనుగోలు చేసిన సోనం తేజస్విని సోయాబీన్ విత్తనాలు విత్తి పది రోజులు గడిచినా మొలకెత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారులతో పాటు కోరమండల్ సంస్థ ప్రతినిధులకు ఫిర్యాదు చేయగా, వారు పొలాన్ని పరిశీలించి వెళ్లారని తెలిపారు. అయితే వ్యవసాయ శాస్త్రవేత్తల నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పగా, కంపెనీ ప్రతినిధులు ఇది విత్తన కంపెనీ పరిధిలోని అంశమని పేర్కొన్నట్లు రైతులు తెలిపారు. సోయాబీన్ సాగుకు అనువైన సమయం ముగుస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మర్లపెల్లి గ్రామంలో ఇదే సమస్యతో పలువురు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, నష్టపోయిన రైతులకు విత్తన కంపెనీ తగిన నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతులు హెచ్చరించారు.

## సైబర్ నేరాల నివారణపై అవగాహన



**రామకృష్ణాపూర్, జూలై 01 (తెలంగాణ వాణి):** పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యుల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఆధార్ నంబర్లు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. అదేవిధంగా అనుమానాస్పద లింకులు, సందేశాలను తెరవకుండా జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో అధికారిక యాప్‌లు, నమ్మకమైన వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలని వివరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించి, సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఉంటా యని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సోయాచంక్స్ తయారీ ఫ్యాక్టరీపై టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల సంయుక్త దాడులు

### 755 కిలోల సోయా చంక్స్, 1600 కిలోల రఫ్ బ్రాన్ సీజ్






**కరీంనగర్, జూలై 01 (తెలంగాణ వాణి)** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామంలో ఉన్న మెగా ఇండస్ట్రీస్ (వీఎస్ బ్రాండ్ సోయా చంక్స్ ) తయారీ ఫ్యాక్టరీపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా మానవ వినియోగానికి ఉద్దేశించిన సోయాచంక్స్ (మిల్‌మేకర్) తయారీలో జంతువుల దాణాగా ఉపయోగించే రఫ్ బ్రాన్ కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫ్యాక్టరీలో ఉన్న 755 కిలోల సోయా చంక్స్‌తో పాటు తయారీలో వినియోగిస్తున్న 1600 కిలోల రఫ్ బ్రాన్‌ను సీజ్ చేశారు. అనంతరం సీజ్ చేసిన ఉత్పత్తుల నుంచి నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ప్రయోగశాలకు (ల్యాబ్‌కు) పంపించారు. ల్యాబ్ నివేదిక ఆధా రంగా సంబంధిత చట్టాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదా ర్థాల తయారీ,విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగు తాయని,నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్ఫోర్స్ ఆర్ఎస్సై శ్రీకాంత్, ఫుడ్ సేఫ్టీ అధికారులు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డి, కానిస్టేబుల్ సాయి, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్గీకరణ ఫలితాలు అందాలంటే ప్రతి విద్యార్థి చదవాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్




**కొత్తగూడెం, జూలై 01 (తెలంగాణ వాణి)** 32 సంవత్సరాల ఉద్యమ ఫలితంగా సాధించుకున్న ఏబీసీడీ వర్గీకరణ వృధా కాకుండా ఉండాలంటే ప్రతి విద్యార్థి చదువుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్ మాదిగ అన్నారు. బుధవారం కొత్తగూడెం టౌన్‌లో నిర్వహించిన గో టు విలేజ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు తెన్నేటి పవన్ కుమార్, ఎమ్మెస్ఎఫ్ జిల్లా ఇంచార్జి దాసరి సారధి మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తగూడెం డివిజన్‌లోని ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క విద్యార్థి చదువుకుంటేనే సాధించుకున్న రిజర్వేషన్ ఫలితాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కూసుపాటి శ్రీనివాస్ మాదిగ, అనుమాల వీరయ్య, చుట్టుగుల నాగరాజు, దాసరి లక్ష్మి, ఇనపనూరి బాబు, ముస్కుటి రాంబాబు, తెన్నేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏల పాత్రే కీలకం

### - మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



**టేకులపల్లి, జూలై 1 (తెలంగాణ వాణి)** బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) పార్టీకి సైనికుల్లా పనిచేస్తూ, బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలకు) పూర్తి సహకారం అందించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు ,బీఎల్ఏల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ...ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి బీఎల్ఏ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా,వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు,మార్పులు,చేర్పులు,తప్పుల సవరణలు మరియు తొలగింపుల విషయంలో బీఎల్వోలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ఆమె, ప్రతి బూత్‌లోనూ పార్టీ బలాన్ని విపరీతంగా పెంచే దిశగా క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టేకులపల్లి మండల పార్టీ ప్రముఖ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో బీఎల్ఏలు పాల్గొన్నారు.

## వ్యవసాయ పనుల నుంచి వస్తూ విషాదం పైపు బిగుసుకుని రైతు మృతి



**వీణవంక, జులై 1, (తెలంగాణ వాణి ప్రతినిధి)** వీణవంక మండలంలోని ఘన్ముకుల గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న కొంక నర్సయ్య (65), పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి, ప్రమాదవశాత్తు మృతి చెందాడు. రూరల్ సీఐ పులి వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం సుమారు 9:30 గంటలకు నర్సయ్య తన వ్యవసాయ భూమిలో పనులు ముగించుకుని సుమారు 20 అడుగుల పొడవున్న ప్లాస్టిక్ పైపును ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకువస్తున్నాడు. పైపు కింద పడకుండా ఉండేందుకు దానిని కుడి భుజంపై పెట్టుకుని, మెడకు కాటన్ తువాలాతో కట్టుకున్నాడు. కొంత దూరం ప్రయాణించిన తర్వాత బలమైన గాలుల కారణంగా వాహనం అదుపుతప్పి, పైపు ముందు భాగం నేలను తాకడంతో నర్సయ్య కిందపడిపోయాడు. ఈ క్రమంలో పైపు మెలికలు తిరగడంతో మెడకు కట్టుకున్న తువాలు బిగుసుకుని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కొంక సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రత్యక్ష దేవుళ్ళు డాక్టర్లు

## ఎడవల్లి కృష్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు



**కొత్తగూడెం, జులై 01 (తెలంగాణ వాణి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం స్థానిక సింగరేణి హాస్పిటల్ నందు బుధవారం ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యం.జె.ఎఫ్ లయన్ డిస్ట్రిక్ అడ్వైజర్ ఎడవల్లి కృష్ణ పాల్గొన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమములో సి.యం.ఓ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ పాల్గొన్నారు, కొత్తగూడెం ప్రముఖ డాక్టర్లు డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉదయ్ భాను, డాక్టర్ విజయ్ కుమార్ లను కూడా సన్మానించడం జరిగింది. అనంతరం ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ ఈ దేశానికి డాక్టర్స్ దేవుళ్ళు అనేక మంది అనేక వ్యాధులతో డాక్టర్స్ దగ్గరికి వెళతారన్నారు. వారు వారికి వ్యాధి తగ్గే వరకు కూడా వారికి సలహాలు సూచనలు ఇచ్చుకుంటూ వారి వ్యాధికి తగ్గ ట్యాబ్లెట్ ఇంజెక్షన్ ఇస్తూ వారికి వ్యాధి నుండి కాపాడుతారని పేర్కొన్నారు.

డాక్టర్లు కూడా చాలా ఓపికతో అనేక మంది రోగాలకు చికిత్స అందించి వారికి దేవుడు లా మారుతారు అన్నారు. వారి సేవలను కొనియాడారు. లయ న్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు చేయడం ఆనందంగా ఉం దన్నారు. రాబోవు రోజుల్లో లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని ఎడవల్లి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కన్వీనర్ మం.జె.ఎఫ్ లయన్ జె.బి మోహన్ రీజన్ ఛైర్పర్సన్ యం.జె.ఎఫ్ లయన్ రాజేశ్వర రావు, జోన్ ఛైర్పర్సన్ లయన్ సమాధానం నీతా,,లయన్ బాబు రావు,లయన్ గోవర్ధన్,లయన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవం



**హుజూర్‌నగర్, జూలై 1 (తెలంగాణ వాణి):** లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్‌ను ఆరోగ్య కేంద్ర సిబ్బంది పుష్పగుచ్ఛంతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ, వైద్యులు మానవ సేవకు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు మరియమ్మ, శివకుమార్, ఫార్మసీ ఆఫీసర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## కోల్ యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు నిరసన

### - కేటీపీఎస్ లో ఉద్యోగుల ధర్నా




**పాల్వంచ జూలై 01 (తెలంగాణ వాణి)** తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి.జి.పి.ఇ.జె.ఎ.సి) ఆధ్వర్యంలో జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలు, యూనిట్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 10వ రోజు స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 10 రోజులుగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సమ్మెబాట పట్టక తప్పడం లేదని వారు వెల్లడించారు. సమ్మె నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన హైదరాబాద్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవనంలో రాష్ట్ర స్థాయి జేఏసీ, ట్రాన్స్‌కో, డిస్కం, జెన్‌కో (బొగ్గు గనులు) నాయకులందరితో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి టీజీపీఈజేఏసీ చైర్మన్ రాజేందర్, జేఏసీ కన్వీనర్ యస్మిన్, ఉమామహేశ్వరరావు, బ్రహ్మాజీ, రఘువీర్, మహేష్, భాగ్యరాజ్, ప్రభాకర్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, రమేష్, సయ్యద్, సాంబమూర్తి, సురేంద్రచారి, సంపత్, పావని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ వనజీవి రామయ్య జయంతి వేడుకలు

**పాల్వంచ, జూలై 01 (తెలంగాణ వాణి)**



కోటి మొక్కల దాత, పర్యావరణ పరిరక్షణ దాత, పద్మశ్రీ డాక్టర్ దరిపల్లి రామయ్య జయంతిని పురస్కరించుకొని బుధవారం పాల్వంచలో వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీఆర్కేఎస్ ఆఫీసులో నిర్వహించిన కార్యక్ర మంలో వనజీవి రామయ్యకు నివాళులర్పించారు. అనంతరం పక్కనే ఉన్న రామాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం కార్పొరేషన్ ఒకటో డివిజన్ కార్పొరేటర్ సిరపు సుగుణ, లక్ష్మీదేవిపల్లి పంచాయతీ మూడో వార్డు సభ్యురాలు రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు బాడిశ శంకర్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఆవిడ రేణుక, ఉపాధ్యక్షుడు కట్టుకూరి నాగేశ్వరరావు, ట్రెజరర్ కోరంపల్లి రామ్మోహన్ కుమార్, జిల్లా వృత్తిదారుల విభాగం అధ్యక్షుడు సైదులు, పాల్వంచ మండల అధ్యక్షుడు కొమరంపల్లి సత్యనారాయణ, నాగభూషణం, జిల్లా నాయకుడు బొమ్మను జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాడిశ శంకర్రావు మాట్లాడుతూ, వనజీవి రామయ్య స్ఫూర్తితో వచ్చే పుట్టినరోజు నాటికి జిల్లా వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

### కేసులను సత్వరంగా పరిష్కరించాలి

### భద్రతతో పాటు మానసిక స్థైర్యాన్ని కల్పించాలి

### భరోసా సెంటర్ సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం






**కరీంనగర్:జూలై 01 (తెలంగాణ వాణి ప్రతినిది)** మహిళలు,చిన్నారులపై హింస,వేధింపులకు గురైన బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. బాధితు లకు భద్రత కల్పించడంతో పాటు మానసిక స్థైర్యాన్ని అందించడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషన రేట్ పరిధిలోని కొత్తపల్లిలోని భరోసా సెంటర్‌లో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధ్యక్ష తన బుధవారం నిర్వహించిన కన్వర్జెన్స్ (సమన్వయ) సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు,చిన్నారుల రక్షణ,పునరావాసం,న్యాయ సహాయం,బాధితులకు అందించాల్సిన సేవలపై వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశంలో పోలీసు శాఖ,వైద్య ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ,జిల్లా న్యాయ సేవ సంస్థ ప్రతినిధులు,చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్,విద్యా శాఖ,సఖి సెంటర్ నిర్వాహకులు,లేబర్ ఆఫీసర్,సంబం ధిత ప్రభుత్వ శాఖల అధికా రులు తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ మహిళలు,చిన్నారులపై జరిగే హింస, లైంగిక వేధింపులు, దాడులు,గృహహింస వంటి కేసుల్లో బాధితులకు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ సహాయం అందించాలని సూచించారు. బాధితులకు ఉచిత కౌన్సె లింగ్, మానసిక ధైర్యం కల్పించడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సను వేగంగా అందించేం దుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం అందేలా సంబం ధిత శాఖలు సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు,వైద్య సేవలు, న్యాయపరమైన ప్రక్రియ,పునరావాస చర్యల్లో ఎక్కడా నిర్లక్ష్యం లేదా జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా ప్రతి శాఖ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా చిన్నారులపై నేరాల కేసుల్లో వారికి అనుకూలమైన వాతావరణంలో సేవలు అందిస్తూ, వారి భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు ప్రత్యేక చొరవతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ,భరోసా సెంటర్ బాధిత మహిళలు,చిన్నారు లకు ఒకే వేదికపై పోలీసు, వైద్య,న్యాయ,కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందిం చే సమగ్ర వ్యవస్థ అని తెలి పారు. బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికా కుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతి కేసును మాన వీయ కోణంలో పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తామని చెప్పారు. బాధితుల గోప్యతను కాపాడుతూ వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని,మహిళలు,చిన్నారుల భద్రతకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో పోక్సో కేసుల దర్యాప్తు పురోగతి,షీ టీమ్స్ పని తీరు,సఖి సెంటర్ నిర్వహణ,ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం అమలు,బాలల రక్షణ చర్యలు,బాధితుల పునరావాసం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. అలాగే బాధితులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయం,పునరావాసం, న్యాయ పరిరక్షణ,మానసిక బలోపేతం వంటి అంశాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధికారులకు సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన వ్యవస్థను మరింత బలోపేతం చేసి,బాధితులకు వేగవంతమైన,నాణ్యమైన సేవలు అందించేందుకు కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. జులై 1 నుంచి జూలై 31 వరకు జరగనున్న ఆపరేషన్ ముస్కాన్ కు సంబంధించి పోస్టర్ ను కలెక్టరు పోలీస్ కమిషనర్ అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్ డిసిపి వెంకటరమణ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తోపాటు జిల్లా న్యాయ సేవ సంస్థ ప్రతినిధులు,పోలీసు అధికారులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం తగదు : ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, జూలై 01 (తెలంగాణ వాణి)**

రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతల తాత్కాలిక మరమ్మత్తు పనులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైవేల నిర్వహణలో నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టామని, పనులను త్వరితగతిన పూర్తి చేసి రవాణాను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, నేషనల్ హైవే అధికారులు శాశ్వత మరమ్మత్తులు చేపట్టి రహదారిని పూర్తిస్థాయిలో సురక్షితంగా మార్చాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు కూరపాటి సుధాకర్, నాయకులు భూక్యా శ్రీనివాస్, నగేష్, మున్సిపల్ ఏఈ శ్రీకాంత్ తదితరులు వున్నారు.

# 2.17 కోట్ల సంక్షేమ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, జూలై 1 (తెలంగాణ వాణి):**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుండగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి వరంగా మారిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొత్తం రూ.2.17 కోట్ల విలువైన సంక్షేమ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందులో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 144 మందికి రూ.1.60 కోట్ల చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 143 మందికి రూ.57.34 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాల కోసం తల్లిదండ్రులు అప్పులపాలు కాకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దోహదపడుతున్నాయని అన్నారు. అలాగే, వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరటనిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, లబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ , సొసైటీ చైర్మన్ హనుమంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, తహసిల్దార్లు పుల్లయ్య, కృష్ణ ప్రసాద్, ప్రసాద్, కార్పొరేటర్లు, నాయకులు వాసిరెడ్డి మురళీ, సర్పంచులు పాల్గొన్నారు.

# సింగరేణి కేంద్ర కార్మిక సంఘాల మహా ధర్నా ఘన విజయం

**కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి**

**జేబీసీసీఐ 12వ వేతన ఒప్పంద చర్చలను వెంటనే ప్రారంభించాలి**

**ఐఎన్టీయుసి సెక్రటరీ జనరల్ డాక్టర్ జనక్ ప్రసాద్**




**కొత్తగూడెం సింగరేణి, జూలై 01 (తెలంగాణ వాణి)**

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, అలాగే జేబీసీసీఐ 12వ వేతన ఒప్పంద చర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం ఎదుట జాతీయ కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయు, హెచ్ఎంఎస్ సంఘాలు ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు భారీ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ నిరసన కార్యక్రమంలో నాలుగు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహా ధర్నాను విజయవంతం చేశారు. అనంతరం సంఘాల ప్రతినిధులు సింగరేణి జీఎం (వెల్ఫేర్) కిరణ్ కుమార్ కి తమ ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం చేకూర్చే విధంగా ఉన్న వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి కార్మికుల ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న జేబీసీసీఐ 12వ వేతన ఒప్పంద చర్చలను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా న్యాయమైన వేతన సవరణను అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు, 12 ఏరియాల వైస్ ప్రెసిడెంట్లు, సెంట్రల్ నాయకులు, ఏరియా నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



# సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**కొత్తగూడెం, జూలై 1 (తెలంగాణ వాణి):**

కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. ఆర్. కిరణ్ రాజ్ కుమార్ హాజరై వైద్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రముఖ వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు డా. బిధాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది : ? అనే అంశంతో వైద్యుల సేవలు, త్యాగాలను గుర్తిస్తూ వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సింగరేణి యాజమాన్యం కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అత్యాధునిక వైద్య సేవలు, నిపుణులైన వైద్యులు, అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు మార్గదర్శకత్వంలో సింగరేణి ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు సేవా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉత్తమ సేవలందించిన డాక్టర్లు డా. ఎం. ఉష, డా. కె.



నాగరాజు, డా. సీహెచ్. రాజశేఖర్, డా. ఎస్. శ్రీనివాసరెడ్డిలను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. ఆర్. కిరణ్ రాజ్ కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీఎంఓలు డా. ఎం. ఉష, డా. జి. సునీల, గైనకాలజిస్ట్ డా. మాలతి, డా. పి. శేషగిరిరావు, డీజీఎం వై.వి.ఎల్. వరప్రసాద్, ఇతర వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

**- జిల్లా విద్యాధికారి డి. వాసంతి**

**చుంచుపల్లి, జూలై 01 (తెలంగాణ వాణి)**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా విద్యాధికారి డి. వాసంతి ఆదేశించారు. మంగళవారం ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్‌తో కలిసి కొత్తగూడెం, చుంచుపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. ముందుగా రైటర్ బస్తి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించి పాఠశాలల్లో నమోదు (ఎన్‌రోల్మెంట్) పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆమె స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ సంయుక్త అక్షరాలను నేర్పించారు.తదుపరి కొత్తగూడెం భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చుంచుపల్లి భవిత కేంద్రంలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంపై ఆరా తీసిన ఆమె, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు అందజేసిన టీచింగ్



అండ్ లెర్నింగ్ మెటీరియల్ ( టి ఎల్ ఎం )ను తప్పనిసరిగా వినియోగించి బోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం బాబు క్యాంపు ప్రాథమిక పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని గమనించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాబు క్యాంపులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జిల్లా విద్యాధికారి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి వారానికి మూడు గుడ్లు అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు, బోధన నాణ్యత, అభ్యసన ఫలితాలు, పోషకాహార కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా విద్యాధికారి డి. వాసంతి స్పష్టం చేశారు.

# కార్మిక గర్జనతో దద్దరిల్లిన కొత్తగూడెం



**వేజ్‌బోర్డు కోసం పిడికిలి బిగించిన జేఏసీ**

**డిమాండ్ల డేతో ఉవ్వెత్తున ఎగసిన కార్మిక ఉద్యమం**

**సింగరేణి హెడ్‌ఆఫీస్ ముట్టడితో మార్మోగిన కార్మికుల నినాదాలు**

**కొత్తగూడెం సింగరేణి, జూలై 1 (తెలంగాణ వాణి):**

జేఏసీ (ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం సింగరేణి హెడ్‌ఆఫీస్ ఎదుట నిర్వహించిన మహా ధర్నా, ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. సింగరేణి వివిధ ఏరియాల నుంచి వేలాది మంది కార్మికులు పాల్గొని 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. వెంటనే 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు చేసి వేతన సవరణ పూర్తి చేయాలని, కార్మిక హక్కులను దెబ్బతీసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే సమ్మెలు, ముట్టడులు, నిరవధిక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. 12వ వేజ్‌బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి అనే నినాదాలతో హెడ్‌ఆఫీస్ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్ , బ్రాంచ్ కార్యదర్శులు మల్లికార్జున్, రమణమూర్తి,నజీర్ మేకల ఈశ్వర్,సుధాకర్, గట్టయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, త్యాగరాజన్, లక్ష్మిరెడ్డి, ఆల్బర్ట్, పీతంబరం, రజాక్, సీఐటీయూ నాయకులు మంద నర్సింహారావు, రాజిరెడ్డి, విజయగిరి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు కృష్ణ ప్రసాద్, ఆంజనేయులు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి

**మున్సిపల్ కమిషనర్‌కు జేబీపీ నేత కామేష్ ఫిర్యాదు**



**కొత్తగూడెం, జూలై 01 (తెలంగాణ వాణి)**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయని జె బి పి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర కామేష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఏంజీ రోడ్డులో ప్రభుత్వ ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ బుధవారం మున్సిపల్ కమిషనర్ సుజాతకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏంజీ రోడ్డులోని ఇంటి నెంబర్లు 6-2-141,6-2-142కు చెందిన షాప్ యజమాని ఇటీవల చేపడుతున్న నిర్మాణాల్లో అవసరమైన అనుమతులు లేకుండానే ప్రభుత్వ ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి సెట్ బ్యాక్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.అంతేకాకుండా భవనం పక్కన ఉన్న స్థలంలో కూడా అక్రమంగా మెట్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాన రహదారిపై ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినా నోటీసులు జారీ చేసే అధికారులు,కొంతమంది విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.వెంటనే స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,పట్టణ అధ్యక్షుడు గజ్జల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశాలతో గురుకులాన్ని సందర్శించిన అధికారులు





**ధర్మారం, జూలై 1 (తెలంగాణ వాణి):**

ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందర్శించారు. ఏఈ రుషికేష్, డీఈ రాజమౌళి, ఈఈ శంకరయ్య పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణతో కలిసి డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను పరిశీలించారు. పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు డ్రైనేజీ వ్యవస్థను తనిఖీ చేసి, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి అంచనా సిద్ధం చేసి నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మంత్రి చొరవ చూపడంపై ప్రిన్సిపాల్ అరుణ, సూపరింటెండెంట్ మోసిన్, పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ సుంచు మల్లేశం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# వేలాదిమందితో కలెక్టరేట్ ఎదుట వామపక్షాల భారీ ధర్నా

**పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదన్న కూనంనేని**

**ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు అంటూ వామపక్షాల పోరుబాట**

**కొత్తగూడెం, జూలై 01 (తెలంగాణ వాణి)**

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసే వరకు ఉద్యమం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, మాస్‌లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన భారీ ధర్నాలో ఆయన మాట్లాడారు.కొత్తగూడెంలో జీవో-76ను పూర్తిస్థాయిలో అమలు చేసి అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని, పాల్వంచలో జీవోలు 444, 999, 817, 727, 410 పరిధిలో దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాల స్థలాలను క్రమబద్ధీకరించి హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు గూడు కల్పించే వరకు వామపక్షాల పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం. సాయిబాబు మాట్లాడుతూ పేదల ఇళ్ల కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వ చర్యలను ప్రజలంతా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదల ఇళ్లకు ఇంటి నంబర్లు జారీ చేసి తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.న్యూ డెమోక్రసీ




నాయకుడు గౌని నాగేశ్వరరావు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావు, సరెడ్డి పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపి ఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, మున్నా లక్ష్మీకుమారి, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, రాహుల్, ఫహీమ్, ఎం జ్యోతి, లిక్కి బాలరాజు, బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, తుపాకుల నాగేశ్వరరావు, ఎం సతీష్, కుంజా కృష్ణ, పెద్దబోయిన సతీష్, ప్రభాకర్, భాస్కర్, వీరభద్రం, శివ,



కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా పేదలకు ఉచిత వైద్య శిబిరం

**వైద్య సేవలకు గుర్తింపుగా లోతువాగు సర్పంచ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**





**లక్ష్మీదేవిపల్లి, జూలై 01 (తెలంగాణ వాణి)**

జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని గిరిప్రసాద్ నగర్, జయశంకర్ కాలనీలలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆశిష్ జకోటియా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి పైగా పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.వైద్య శిబిరం అనంతరం గ్రామ ప్రజలకు నిస్వార్థంగా ఉచిత వైద్య సేవలు అందించినందుకు గుర్తింపుగా, జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా లోతువాగు సర్పంచ్ ఈసం కళ్యాణి ఆధ్వర్యంలో డాక్టర్ ఆశిష్ జకోటియాను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు డాక్టర్ అందించిన సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లోతువాగు ఉపసర్పంచ్ యాకూబ్ పాషా, కార్యదర్శులు పసుపులేటి కృష్ణ, తుమ్మల వెంకట్, వార్డు సభ్యులు మల్లాది పుల్లయ్య, పదం ఉమ్, సీపీఐ నాయకులు గుత్తుల సత్యనారాయణ, కదారి పోశం, ఎడ్ల శీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం, అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అలసట ఎరుగని యోధులు వైద్యులు

**డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ భార్గవ్‌ను సన్మానించిన బట్టు మంజుల**



**పాల్వంచ, జూలై 1 (తెలంగాణ వాణి):**

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ భార్గవ్‌ను దిశా వెల్ఫేర్ ఫౌండేషన్ మండల అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పాల్వంచ పట్టణ మహిళా అధ్యక్షురాలు, సేవాలాల్‌మహిళా సేన జిల్లా ప్రధాన కార్యదర్శి, జేఏసీ కో-కన్వీనర్ బట్టు మంజుల శాలువాతో సన్మానించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తున్న వైద్యుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మ, సరోజా, స్టాఫ్ నర్సుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కొత్వాల శ్రీనివాసరావు






**పాల్వంచ, జూలై 1 (తెలంగాణ వాణి)**

కొత్తగూడెం నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే కొత్తగూడెం డివిజన్ మహాసభలో పాల్గొన్న ఆయన, జర్నలిస్టు నాయకులను శాలువాలు, బొకేలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.